దన్నది ఇప్పుడు "తెలుగు సాహితీరంగానికి సంబంధించిన అందరికీ తెలిసిన విషయమే"

థామస్ పెయిన్ రాసిన ఆ కొటేషన్ని మరోసారి చదివాను.

"ఒక రచయిత కీర్తి ప్రతిష్ఠలను తగ్గించేది ఇతర రచయితలు కాదు అతని రచనలే అంతపని చేస్తాయి"

# సంయుక్త కోరిన కథ

పాప్యులర్ రచయిత బల్వంతరావు.

తన ఆఫీసులో స్టెనోకి ఇంగ్లీష్‌లో ఒక వుత్తరము డిక్టేట్ చేసాడు.

డియర్ ఫ్రెండ్!

ఈ వుత్తరం అందగానే ఒక పాతిక రూపాయలు నాకు వెంటనే మనిఆర్డర్ చేయవలసిందిగా కోరుతున్నాను రెండు నెలల్లో నీకు తీర్చబడుతుంది. "ఆంధ్రరత్న" వారపత్రికలో నా సీరియల్ నవల వస్తుంది చదువుతున్నావా?

యువర్స్ ట్రూలీ.

"............"

అతని లెటర్‌పాడ్ మీద స్టెనో పన్నెండు వుత్తరాలను టైపు చేసింది బల్వంతరావు తన చిరునామాల పుస్తకం తీసి అందులోని ఆరు చిరునామాలలోంచి (తొంభై శాతంమంది అతని అభిమానులే) పన్నెండు ఎన్నికచేసి స్టెనోకి ఇచ్చాడు కవర్లమీద ఆ చిరునామాలను టైపుచేసి బల్వంతరావు సంతకం చేసిన వుత్తరాలను వాటిల్లో వుంచి అతని వ్యక్తి

గత వుత్తరాల కోసం పోస్టేజ్ అకౌంటు మెయిన్‌టెయిన్ చేసే స్టెనో వాటిని పోస్టు చేసింది.

బల్వంతరావుకు పది రోజులతో ఆ పన్నెండుమందినుంచీ పాతిక రూపాయలు మని ఆర్డర్లు వచ్చాయి. పోస్టుమేన్ టిప్ పోను మిగిలిన సొమ్ముతో బల్వంతరావు తను చాలాకాలంగా కొనాలనుకొంటున్న ఎలక్ట్రానిక్ పెన్‌ని కొన్నాడు.

తరచు ప్రయాణంచేసే బల్వంతరావు రాత్రిళ్ళు రైల్లో ప్రయాణం చేస్తూ చీకట్లో రాసుకోడానికి ఆపెన్ ఎంతో వుపయోగంగా వుంటుంది. పెన్‌కున్న ఒక మీటరు నొక్కితే పెన్‌కి వెలిగే బల్బులోంచి సన్నటికాంతి రాసే కాగితంమీద మాత్రం పడుతుంది. ఇతరులకు యిబ్బంది వుండదు.

బల్వంతరావు సీరియల్ అయిపోగానే "ఆంధ్రరత్న" ఎడిటర్ ఆ నవలమీద ప్రశ్నావళిని ప్రకటించాడు. ఆరు వారాలపాటు బల్వంతరావు ప్రశ్నావళికి వచ్చిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చాడు. అందులో ప్రతీ వారం రెండు వుత్తమ ప్రశ్నలకి–ఒక్కొక్కదానికి పాతిక రూపాయల చొప్పున నగదు బహూమతి వుంది.

ఆ పన్నెండు బహూమతులు పొందిన ప్రశ్నలు పంపినవారు, బల్వంతరావుకి అప్పుగా పాతిక రూపాయలు పంపినవారే. "ఆంధ్రరత్న" నుంచి తనకి పాతిక రూపాయలు బహుమతి రావడం వాళ్ళని ఆశ్చర్యపరిచింది.

"నీ బాకీని "ఆంధ్రరత్న" ద్వారా తీర్చాను. నీ పేరుమీద ఓ ప్రశ్నని సృష్టించి, దానికి ఉత్తమ బహూమతి ఇచ్చాను" అని బల్వంతరావు నుంచి వుత్తరాలు వెళ్ళేదాకా వాళ్ళకి సంగతి బోధపడలేదు.

("చంటబ్బాయ్" సీరియల్‌లో ఆంధ్రజ్యోతి ఎడిటర్ పాఠకుల వుత్తరాలను వారి చేతివ్రాతలోనే ప్రింటు చేయించిన ప్రక్రియమీద మీరు మినీ కథ వ్రాసారు. ఏదీ–మీ పాఠకుల ప్రశ్నలకు రచయిత సమాధానంమీద ఓ మినీకథ రాయండి చూద్దాం?"

వి. కె. సంయుక్త అలహాబాద్ నుంచి అడిగిన యీ ప్రశ్నకు సమాధానంగా పై మినీకథ)

★

## సగటు రచయిత

ఆరోజు కాలేజీలో అంతా హడావిడిగా వున్నారు. కారణం, ఆరోజు కాలేజ్ డే.

ఆ సందర్భంగా, ఒక ముఖ్య అతిథి విచ్చేస్తున్నాడు. అతని పేరు సార్వభౌమారావు అతన్ని అతిథిగా ఆహ్వానించడానికి కారణం, కేవలం అతను రచయిత అయివుండటమే

కార్యక్రమం మొదలయింది ముందర ప్రిన్స్‌పాల్ సార్వభౌమారావుని వేదికమీదకి ఆహ్వానించి, ఒక అయిదు నిమిషాలు తను మాట్లాడి సార్వభౌమారావుని ఆ తర్వాత మాట్లాడమని కోరి కూర్చున్నాడు.

సార్వభౌమారావుకి అదే మొదటిసారి కాదు స్టేజిమీద వందలమంది ముందు పూలదండ వేయించుకోవటం, మాట్లాడటం. అందుకని తత్తర పడకుండా ప్రసంగించసాగాడు

తను పది సంవత్సరాలకు పూర్వం ఇదే కాలేజీలో విద్యార్థిననీ, తనకు గౌరవం ఇచ్చినందుకు అందరికి కృతజ్ఞతలు తెల్పుకుంటున్నానని చెప్పి, తను ఎన్నుకున్న అంశం ధారాళంగా ప్రసంగించసాగాడు.

ఆ అంశం "మంచి కథ వ్రాయడం ఎలా?"

కథలోని భాగాలు_అంటే శిల్పం, శైలి ఎతుగడ, పాత్రలు, ముగింపు, పాత్ర పోషణలాంటి అనేకవాటిమీద, తన అనుభవంలోని విషయాలను అక్కడక్కడ వుదహరిస్తూ, ముప్పావుగంట పైగా శ్రోతలందరినీ అంగుళం అయినా కదలకుండా కూర్చోపెట్టేశారు సార్వభౌమారావు.